ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి
# జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | ఆదివారం | 19.07.2026 | సంపుటి : 2 | సంచిక : 18 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు



## బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ

**బహద్దూర్ గూడ వద్ద తీవ్ర ఉద్రిక్తత**

అధికారుల తీరుపై రైతుల మండిపాటు

భూముల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరిక

ఐదురోజులుగా కొనసాగుతున్న ఆందోళన 03



03

## 21న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

ఏర్పాట్లపై అధికారులతో తలసాని సమీక్ష

# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

**స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం**



తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం

అరగంటలోపే సరిదిద్ది ప్రయోగాన్ని పూర్తి చేసిన షార్

ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం

ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు

**శ్రీహరికోట, జులై 18 :** భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు

మిగతా 2 లో

## 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు

ఇంజనీర్లని ప్రశంసిస్తూ.. తనను కలవాలని సందేశం

భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ.

02





## భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

**అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నాం**

బండి సంజయ్, ఈటెల మధ్య సయోధ్యకు యత్నం

ఎంపి లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు నేతలతో అభయ్ పాటిల్ చర్చలు

తెలంగాణలో అధికారం బిజెపిదేనన్న ఎంపి లక్ష్మణ్

తెలంగాణ భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నామని బిజెపి ఎంపి లక్ష్మణ్ అన్నారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య ఉన్న విభేదాలపై ఆయన స్పందించారు. కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ భేటీ అయ్యారు.

హైదరాబాద్, జూలై 18 : ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇరువురు నేతలతో గంట పాటు సమావేశం జరిగింది. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అభయ్ పాటిల్ వారికి సూచించారు. కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన అంశాల్లో ఇద్దరూ కలిసి పని చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే.. అంతర్గతంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. అనంతరం ఇరువురు నేతలతో కలిసి ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడంపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్‌పై కోపం ఉందని,

-మిగతా 02 లో..

# నోటిఫికేషన్లు లేవు.. అన్నీ లూటిఫికేషన్లే

**లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది?**

జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ?

ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి

మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్

చాయ్ పే చర్చను మరచిన రాహుల్

**బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు**



హైదరాబాద్, జూలై 18 : ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని..

మిగతా 2 లో



## నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బీఆర్ఎస్ నేతలు

**అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కెసిఆర్**

వేల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లతో కులుకుతున్న నేతలు

నేనున్నంత వరకు బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల

అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సిఎం రేవంత్ విమర్శలు

హైదరాబాద్, జూలై 18 : దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్

మిగతా 2 లో

## ఆహార కల్తీపై ఉక్కుపాదం

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు

ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం

ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం

సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు

వాటి స్వచ్ఛతపైనా ఇక నుంచి పరిశీలన

అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన

ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం 02



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 140 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 167 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 259 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹98

## జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా కమిటీ కుర్రోళ్లు ఎంపి

విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులు

న్యూఢిల్లీ, జూలై 18 : 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అంతే కాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదువంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది.

-మిగతా 2 లో..





## నేను ఎప్పుడూ పదవులు అడుక్కోను

**నా నిర్ణయాలన్నీ సంచలనంగానే ఉంటాయి**

ఎమ్మెల్యే రాజగోపాలరెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, జూలై 18 : నేను ఎప్పుడూ పదవులు అడుక్కోను.. నేనొక ఫైటర్‌ను. నేను ఏ నిర్ణయం తీసుకున్నా అది ఒక రెవల్యూషన్ లాగే ఉంటుందని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే.. తనను ఓడించడానికి వంద మంది ఎమ్మెల్యేలు మునుగోడుకు వచ్చారని, అలాగే ఎమ్మెల్సీ పోటీలో

-మిగతా 2 లో..

## ఆయిల్ పామ్ రైతుల కోసం ఏకమవుదాం

కేంద్రంపై ఒత్తిడి పెంచుదాం రండి

దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు తుమ్మల లేఖ

హైదరాబాద్, జూలై 18 : కేంద్రంపై ఉమ్మడిగా ఒత్తిడికి దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఆయిల్ పామ్ రైతుల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకమవ్వాలని కోరారు. ప్రధాని మోదీని కలిసి ఆయిల్ పామ్ రైతుల



-మిగతా 2 లో..



## భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

(మొదటిపేజీ తరువాయి)

అలాగే బీఆర్ఎస్‌పై నమ్మకం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని, జమిలి ఎన్నికలు జరుగుతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. భాజపాను అధికారంలోకి తెచ్చేందుకు తామంతా కలిసి పనిచేస్తామని వివరించారు. తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బీఆర్ఎస్ నేతలు

(మొదటిపేజీ తరువాయి)

గేటు ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడని రేవంత్‌రెడ్డి అన్నారు.



## ఆహార కల్తీపై ఉక్కుపాదం

**హైదరాబాద్, జూలై 18 :** ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలనలు చేపట్టి ఇంధన ప్రక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహోస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు



చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది. ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## నోటిఫికేషన్లు లేవు.. అన్నీ లూటిఫికేషన్లే

(మొదటిపేజీ తరువాయి)

జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిద్దారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

## ఆయిల్ పామ్ రైతుల కోసం ఏకమవుదాం

(మొదటిపేజీ తరువాయి)

సమస్యలు వినిపిద్దామన్నారు. ఆయిల్ పామ్‌కు కనీస హామీ ధర రూ.25 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేదంటే క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించాలన్నారు. దిగుమతి సుంకాల తగ్గింపుతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతోందని మంత్రి తెలిపారు. దేశ ఆయిల్ పామ్ సాగులో 75 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదే అని చెప్పుకొచ్చారు. రైతులకు స్థిర ఆదాయం కోసం కేంద్రం తక్షణ జోక్యం అవసరమన్నారు. వంటనూనెల స్వయం సమృద్ధి లక్ష్యానికి రైతుల రక్షణ కీలకమన్నారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం దక్షిణాది రాష్ట్రాలు కలిసిరావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

## విక్రమ్-1 విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

### స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు

### ఇంజనీర్ల కృషిని ప్రశంసిస్తూ..తనను కలవాలని సందేశం

**న్యూఢిల్లీ, జులై 18 :** భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని మీరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. 'విక్రమ్-1'లో తన 'వందేమాతరం' సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు. 'ఈ ప్రయోగం ద్వారా 'వందేమాతరం' సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది' అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు 'మిషన్ ఆగమన్' పేరిట చేపట్టిన 'విక్రమ్-1' రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది.

## జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత, మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది. ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు. దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా జాతీయ అవార్డు దక్కింది. మాస్‌నే కాదు, బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2'. ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా దీపాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది '35- చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్‌దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.

## నేను ఎప్పుడూ పదవులు అడుక్కోను

(మొదటిపేజీ తరువాయి)

తాను నిలబడితే ఆనాడు కేసీఆర్‌కు నిద్ర కూడా పట్టలేదని తన రాజకీయ రికార్డును గుర్తుచేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియా ప్రతినిధులతో జరిపిన చిట్‌చాట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. తన మంత్రి పదవి, కుటుంబంలో ఇద్దరికి పదవుల అంశంపై వస్తున్న విమర్శలపై ఆయన తనదైన శైలిలో స్పందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడకముందు జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ.. ఎన్నికల ముందు ఏఐసీసీ నాయకత్వం ఆరుగురు సీనియర్లకు మంత్రి పదవులు ఇస్తామని హామీ ఇచ్చిందని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. 'హైకమాండ్ ఆరుగురిలో ఐదుగురికి మంత్రి పదవులు ఇచ్చింది. కానీ నా ఒక్కడికే ఇవ్వలేదు. అలాగని నేను పదవి కోసం అడుక్కునే టైం ఇది కాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తన అంతరంగాన్ని ఆయన ఈ సందర్భంగా బయటపెట్టారు. సొంత అన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పటికే క్యాబినెట్ మంత్రిగా ఉన్నందున, 'ఒకే కుటుంబానికి ఒకే పదవి' అనే నిబంధన వల్లే రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కలేదనే ప్రచారంపై ఆయన తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ రూల్స్‌పై స్పందిస్తూ.. భార్యాభర్తలు మాత్రమే ఒక కుటుంబం కిందకు వస్తారు. కానీ అన్నాదమ్ములు ఒకే కుటుంబం ఎలా అవుతారని ప్రశ్నించారు. దీనికి ఉదాహరణగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులను ప్రస్తావిస్తూ.. 'ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మావతి ఇద్దరూ ఒకే ఫ్యామిలీ అవుతారు. కానీ మేము అన్నదమ్ములం, ఇద్దరం వేర్వేరు ఇళ్లలో ఉంటున్నాం. అలాంటప్పుడు అన్న, నేను ఇద్దరం ఒకే కుటుంబం అంటే ఎలా కుదురుతుందని రాజగోపాల్ రెడ్డి నిలదీశారు. భిన్నమైన ఇళ్లలో ఉంటూ రాజకీయంగా విడివిడిగా కష్టపడుతున్న తమకు ఈ నిబంధన వర్తింపజేయడం సరికాదనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

**16 నుండి 26 వరకు బోనాలు- చేతివృత్తుల మేళా**

**ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శనలు**

**మంత్రి పొన్నం ప్రభాకర్**





**హైదరాబాద్, జూలై 18 :** చేతి వృత్తి కళాకారులకు చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'బోనాలు- చేతివృత్తుల మేళా, బిసి చేతివృత్తుల అమ్మకాలు- ప్రదర్శన'ను ఈనెల 16వ తేదీ నుండి 26 వరకు ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహము ప్రక్కన గల గ్రౌండ్స్ లో నిర్వహిస్తోంది. చేతివృత్తుల కళాకారులచే తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, విక్రయము విజయవంతంగా కొనసాగుతున్నది. ఈ ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారు చేసిన మట్టిపాత్రలు, గౌడన్నల 'నీరా' స్టాల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు,హ్యాండ్ లూమ్స్ పోచంపల్లి-ఇక్కత్, గద్వాల్ - నారాయణపేట్, పూసలవారి సామగ్రి, మహిళా స్వయం సహాయక సంఘాల స్వగృహ ఫుడ్స్, ఇతర బిసి వర్గాలచే తయారు చేయబడిన వస్తువులు, తెలంగాణ వంటకాలు, మత్స్య కారుల తయారు చేయబడే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనలో లభించే వస్తువులు వినియోగదారులకు, సందర్శకులకు సరసమైన ధరలలో లభ్యమవుతున్నాయి. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 10:00 గంటల వరకు కొనసాగుతున్నది. ప్రభుత్వం సందర్శకులకు ప్రవేశము ఉచితంగా కల్పిస్తున్నది. ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణతో స్టాల్స్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేనేత, హస్తకళలు, మట్టి కళలు, చెక్క బొమ్మలు వంటి సంప్రదాయ కళలను ప్రోత్సహించడ మే ఈ మేళా ప్రధాన లక్ష్యమని, గ్రామీణ కళాకారుల ప్రతిభకు మార్కెట్ కల్పిస్తూ వారి జీవనోపాధిని బలోపేతం చేయడంలో ఇటువంటి మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనకు అనుగుణంగా స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని, సాంప్రదాయ కళలను నేటి తరానికి పరిచయం చేసి, భావితరాలకు అందించడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కళాకారుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ అవకాశాల విస్తరణకు కట్టుబడి ఉందన్నారు. మేళాలో పాల్గొన్న ప్రతి కళాకారుడికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మన కళలు, మన చేతివృత్తులు? మన సంపద అనే భావనతో ప్రతి ఒక్కరూ ఈ మేళాను విజయవంతం చేయాలన్నారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులు కనుమరుగు అవ్వకుండా మరింతగా ప్రోత్సహించెందుకు ప్రభుత్వం ప్రదర్శనను ఏర్పాటు చేసింది.





## దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ

**'విక్రమ్-1' విజయవంతంపై రేవంత్ హర్షం**

**హైదరాబాద్, జూలై 18 :** భారత్ తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతంపై తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. 'హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్' అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతమైన ప్రయోగ మన్నారు. శ్రీహరికోట నుంచి విక్రమ్-1 నింగిలోకి దూసుకెళ్లిందని, హైదరాబాద్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ ఘన విజయం సాధించిందని తెలిపారు. భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుందన్నారు. దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ నిలిచిందని సీఎం అన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ శక్తికి ప్రపంచ వేదికపై గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా స్కైరూట్ బృందానికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1.. ప్రైవేట్ స్పేస్ రంగంలో భారత్ సత్తా చాటిందని కొనియాడారు. భవిష్యత్తు అంతరిక్ష ప్రయాణాలకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడిందని ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## అథ్లెట్ ప్రవల్లికకు సిఎం రేవంత్ అభినందనలు



**హైదరాబాద్, జూలై 18 :** చైనాలోని ఒర్డోస్‌లో జరిగిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4-400 మీటర్ల రిలే పోటీలో స్వర్ణ పతకం సాధించిన తెలంగా ణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆధ్వర్యంలోని గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని నరిమళ్ల ప్రవల్లికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉన్నతాధికారులతో కలిసి ప్రవల్లిక ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభినందించిన సిఎం క్రీడలకు తెలంగాణ కేంద్రంగా మారాలని అభినందించారు. ప్రవల్లికకకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ

**బహద్దూర్ గూడ వద్ద తీవ్ర ఉద్రిక్తత**

**అధికారుల తీరుపై రైతుల మండిపాటు**

**భూముల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరిక**

**ఐదురోజులుగా కొనసాగుతున్న ఆందోళన**



**రంగారెడ్డి, జూలై 18 :** శంషాబాద్ బహదూర్ గూడలో ఉద్రిక్తత నెలకొంది. బుల్లెట్ ట్రైన్ కోసం భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. బహదూర్ గూడా భూముల దగ్గరకు హైడ్రా అధికారులు భారీగా చేరుకున్నారు. భూముల వ్యవహారంలో ఐదు రోజులుగా రైతుల ఆందోళన కొనసాగుతోంది. స్పష్టమైన హామీ ఇచ్చాకే భూములు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. బహదూర్‌గూడ భూముల జోలికొస్తే ఖబర్దార్ అంటూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హెచ్చరించారు. హైడ్రా కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని అనుకున్నాం. కానీ మీరు బ్లాక్ మెయిలర్‌లు ప్రజలను భయపెట్టడానికి వచ్చిన హైడ్రా అంటూ విరుచుకుపడ్డారు. బహదూర్‌గూడా భూములపై స్టాటస్‌కో ఉంది కాబట్టి జిల్లా కలెక్టర్ కోర్టు అనుమతి లేకుండా భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని ప్రజాక్షేత్రంలో నిలబెడతామని అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో చేపట్టిన రైతు నిరసన ఐదో రోజుకు చేరింది. రైతులకు ఈరోజు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ రాజేందర్ నగర్ ఇంచార్జ్ పట్ల కార్తీక్ రెడ్డి నిలబడ్డారు. బహదూర్ గూడ లోని వ్యవసాయ పొలాలని తరతరాలుగా సాగు చేసుకుంటూ వస్తున్న ప్రజలకు బులెట్ ట్రైన్ పేరుతో లాక్కోవాలని చూస్తుంది. కానీ ముమ్మాటికి రైతుల పక్షాన ఉండి పోరాడుతాం, ఎక్కడికైనా వెళతాం కానీ రైతుల భూములను లాక్కునే ప్రసక్తి లేదంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. భూముల రైతులను పిలిచి బెదిరించి భూములను తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది. కానీ బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడుతుందని ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రానున్న 2 సంవత్సరాల్లో కెసిఆర్ ప్రభుత్వం రాబోతుంది కాబట్టి బహదూర్ గూడా రైతులు ఎట్టి పరిస్థితుల్లో ఆందోళన చెందొద్దని అందరికీ కెసిఆర్ చేతుల మీదుగా పట్టా, పాసు పుస్తకాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.



## స్కైరూట్ మన టీ హబ్‌లోనే పుట్టింది

**విక్రమ్ విజయవంతంపై కెటిఆర్ అభినందనలు**

**హైదరాబాద్, జూలై :** టి హబ్ వేదికగా ఏర్పడ్డ స్కైరూట్ సంస్థ శ్రీహరికోటలో చేపట్టిన విక్రమ్-1 రాకెట్ ప్రయోగ విజయవంతం కావడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ సరూర్ నగర్‌లో తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ.. టీ హబ్‌లో పురుడు పోసుకున్న కంపెనీ పేరు స్కైరూట్. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏండ్లు అయింది. ఇవాళ భారతదేశ చరిత్రలో ఒక ప్రైవేట్ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపిన ఆ కంపెనీ మన టీహబ్ నుంచే వచ్చిందన్నారు. ఇవాళ ఉదయమే ప్రయోగం విజయవంతంగా నిర్వహించారు. ఈ రోజు శ్రీహరికోట నుంచి ప్రైవేట్ రాకెట్‌ను పంపిన స్కైరూట్ కంపెనీకి చప్పట్లతో అభినందనలు తెలుపాలని కేటీఆర్ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. ఇస్రో నుండి తొలిసారి ప్రైవేట్ రాకెట్ ప్రయోగం సక్సెస్ అవడంతో స్కైరూట్ కంట్రోల్ సెంటర్‌లో సంబురాలు చేసుకుంటున్నారు.



## 21న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

**ఏర్పాట్లపై అధికారులతో తలసాని సమీక్ష**

**హైదరాబాద్,జూలై18 :** ఈ నెల 21న నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం, 22న జరగనున్న రథోత్సవం సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏర్పాట్లపై చర్చించారు. ఈ వేడుకలకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తారని వెల్లడించారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ప్రజలు సంతోషంగా జరుపుకునే వేడుకకు ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెట్టొద్దని అధికారులకు స్పష్టం చేశారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించాలని, నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. భక్తులు తోపులాటకు గురికాకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రథోత్సవం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ పరిసరాలలో ప్రత్యేక హెల్త్ క్యాంప్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, డీసీ సుజాత, వాటర్ వర్క్స్ జీఎం సతీష్, ఎలక్ట్రికల్ డీఈ కిషోర్, ఆర్ అండ్ బి డీఈ మనోహర్, లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఫాల్కన్ గ్రూప్ సిఎండి అమర్‌దీప్‌ను అరెస్ట్ చేసిన ఈడీ

**14రోజుల రిమాండ విధించిన కోర్టు.. చర్లపల్లికి తరలింపు**

**హైదరాబాద్,జూలై18 :** ఫాల్కన్ గ్రూప్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫాల్కన్ సీఎండీ అమర్‌దీప్ కుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని తీహార్ జైలు నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి అమర్‌దీప్ అరెస్ట్‌ను చూపించారు అధికారులు. అనంతరం ఫాల్కన్ సీఎండీని న్యాయస్థానంలో హాజరుపరచగా.. కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో అధికారులు అమర్‌దీప్‌ను చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. ఫాల్కన్ సంస్థ.. పెట్టుబడిదారులకు 11 శాతం నుంచి 21 శాతం వరకు అధిక లాభాలు ఇస్తామని హామీ ఇచ్చి భారీగా నిధులు సమీకరించినట్లు ఈడీ గుర్తించింది. మొత్తం రూ.4,215 కోట్ల మేర పెట్టుబడులు సేకరించినట్లు వెల్లడించింది. కొత్త పెట్టుబడిదారుల నుంచి వచ్చిన డబ్బుతో పాత పెట్టుబడిదారులకు చెల్లింపులు చేసినట్లు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గుర్తించింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు రూ.792 కోట్లను నేర ఆదాయంగా గుర్తించినట్లు తెలిపింది. ఇప్పటికే ఈ కేసులో రంగారెడ్డి జిల్లాలోని ఆస్తులతో పాటు హాకర్ 800ం విమానం సహా రూ.20.6 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది. విచారణకు సహకరించకపోవడంతో ఖఓఒం సెక్షన్-19 కింద అమర్‌దీప్ కుమార్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. ఫాల్కన్ మనీలాండరింగ్ కేసులో నిధుల మళ్లింపు, ఇతర నిందితుల పాత్రపైనా ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది.

## పాతబస్తీ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై దాడులు

**హైదరాబాద్,జూలై18 :** ఎన్ని దాడులు నిర్వహించిన హోటల్ యాజమాన్యాల్లో మార్పు కనిపించడం లేదు. నగరంలో ఫుడ్ సేఫ్టీ నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చాంద్రాయణగుట్టలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు మెరుపు దాడులు చేశారు. అల్-మదీనా చైనీస్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, ఒమెర్ చైనీస్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో తనిఖీలు చేయగా.. అపరిశుభ్ర పరిస్థితుల్లో ఆహారం తయారు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో రెండు కేసులు నమోదు చేసిన అధికారులు.. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వాడిన వంట నూనెను తిరిగి వినియోగిస్తున్నారని, కృత్రిమ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే పెస్ట్ కంట్రోల్ రికార్డులు, వాటర్ అనాలిసిస్ సర్టిఫికెట్లు లేనట్లు తనిఖీల్లో బయటపడింది. సుమారు 20 లీటర్ల రీయూజ్డ్ కుకింగ్ ఆయిల్, 10 లీటర్ల ఫ్రెష్ కుకింగ్ ఆయిల్‌ను సీజ్ చేశారు. సుమారు 40 కిలోల ఫ్రైడ్ చికెన్‌తో పాటు 40 కిలోల రంగు కలిపిన రా చికెన్‌ను అధికారులు సీజ్ చేశారు. 3 బాక్సులు, 6 ప్యాకెట్ల ఆర్టిఫిషియల్, సింథటిక్ ఫుడ్ కలర్స్‌ను హెచ్‌ఫాస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితులను, సీజ్ చేసిన సామగ్రిని చాంద్రాయణగుట్ట పోలీసులకు అధికారులు అప్పగించారు.

## రవాణాశాఖ నిబంధలను కఠినతరం

- **నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై నజర్**
- **తనిఖీలు ముమ్మరం చేయనున్న అధికారులు**

**హైదరాబాద్, జూలై 18 :** రాష్ట్రవ్యాప్తంగా రవాణా నిబంధనలను కఠినతరం చేశారు. ఉల్లంఘించే వాహనాలపై ఉక్కుపాదం మోపాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించడంతో అధికారులు తగు చర్యలకు దిగుతున్నారు. ముఖ్యంగా స్కూల్ బస్సులతో పాటు, అధికా లోడ్‌తో వెళ్లే వాహనాలపై దృష్టి సారించారు. రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసి, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఓవర్‌లోడింగ్ వాహనాలు, త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేని వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను అవసరమైతే వెంటనే సీజ్ చేయాలని రవాణా అధికారులు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గతంలో చెక్‌పోస్టులను రద్దు చేసిన సమయంలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందువల్ల ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందిని అత్యంత సమర్థవంతంగా వినియోగించుకుంటూ తనిఖీల వేగాన్ని పెంచనున్నారు. జూన్ 8 నుంచి ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా రంగంలోకి దించిన మొబైల్ స్క్వాడ్‌ల పనితీరును ఇటీవలే మంత్రి పొన్నం సమీక్షించారు. త్రైమాసిక పన్నులు చెల్లించకుండా ఎగవేస్తున్న వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని.. స్లీపర్ బస్సుల్లో జరిగే నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించకుండా, గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



## పవన్ కళ్యాణ్‌కు లోకేశ్ పరామర్శ

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**హైదరాబాద్, జూలై 18 :** కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌ను కలిసిన ఆయన.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇటీవల ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో పవన్ కల్యాణ్ శస్త్ర చికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలో వైద్యుల బృందం పవన్ కుడి భుజానికి సర్జరీ చేసింది.

## మెడికల్ విద్యార్థినితో పాటు ఆమెను ప్రేమిస్తున్న యువకుడు ఆత్మహత్య

**ఒకే గ్రామంలో వేర్వేరు చోట్ల ఘటన**

**నల్లగొండ, జూలై 18 :** జిల్లాలో వైద్య విద్యార్థిని, ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. కట్టంగూరు మండలం మునుకుంట్ల గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ తొలి సంవత్సరం చదువుతున్న యువతి.. ప్రిపరేషన్ హాలిడేస్ నిమిత్తం స్వగ్రామమైన మునుకుంట్లకు వచ్చింది. శుక్రవారం సాయంత్రం ఇంట్లో దూలానికి ఉరివేసుకున్న స్థితిలో యువతి కనిపించింది. సాయంత్రం ఇంటికి వచ్చిన ఆమె సోదరి ఈ విషయాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. అదే గ్రామానికి చెందిన చరణ్ అనే యువకుడు.. యువతిని కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో చరణ్ కూడా తమ వ్యవసాయ బావి వద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం చరణ్ మరో వ్యక్తితో కలిసి యువతి ఇంటికి వెళ్లి వచ్చిన తర్వాతే ఈ రెండు ఘటనలు చోటుచేసుకోవడంతో యువతి మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చరణ్ బలవంతం చేశాడా, లేదా మరేదైనా అఘాయిత్యానికి పాల్పడ్డాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువతి తండ్రి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో వార్డు బాయ్‌గా పనిచేస్తుండగా, తల్లి స్వగ్రామంలో కూలీగా పనిచేస్తున్నారు.

# కాళేశ్వరం.. ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం!



**దొంగలుపడ్డ ఆరు నెలలకు.. అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచారణకు ఓ కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూపించ లేకపోయారు. కాళేశ్వరం, ధరణి, ఈ కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. కేవలం బిఆర్ఎస్‌పై రాజకీయంగా పైచేయి సాధించేందుకు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాళేశ్వరం కూలేశ్వరం అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచు కూడా ముందుకు కదలలేదు.**

లక్షకోట్లు పెట్టిన ప్రాజెక్ట్ పడావు పడ్డది. దానిని ఎలాగైనా వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు లేకుండా పోయింది. ఎంతసేపు రాజకీయంగా విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన అవినీతిపై ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని కేవలం రాజకీయంగా ఉపయోగించు కుని బిఆర్ఎస్‌ను భ్రష్టు పట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ పల్లవి అందుకున్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వినిగింలోకి ఎలా తేవడం అన్న ఆలోచన పక్కన పెట్టారు. అందుకే నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా ఉపయోగించుకోవాలన్నది ఆలోచించడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలింపు అసాధ్యమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగడంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మోటర్లు, కాలువలు అంతా వృధా అవుతున్నాయి. ఇదే విషయాన్ని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ప్రస్తావిస్తే.. ఆయనను బిఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణించి విమర్శలతో దాడి చేశారు. నిజానికి గత 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అక్రమాలు ప్రధాన భూమిక పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేకానేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డదన్నట్లుగా సాగుతున్నారు. పదికాలాలపాటు పనికి వచ్చే పనులు చేయడం లేదు.

ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరిం చాలన్న దానిమీద సరైన అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్దరించే ప్రయత్నాలు చేసి, నీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చివుంటే, ఈయేడు మంచి ఫలితాలు వచ్చేవి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టను ఉపయోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఆ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డామ్ సేప్టి అథారిటి చెప్పిందని, అందువల్ల అక్కడ నీటిని వినియోగంలోకి తసీఉకుని రావడం అసాధ్యమని చెబుతున్నారు. కాళేశ్వరం ఎటిఎంగా మారిందని గతంలో బిజెపి కూడా ఆరోపించింది. రేవంత్ రెడ్డి కూడా ఇదే ప ÷-రచారం చేశారు. పోనీ అలాగని ఇందులో జరిగిన అవినీతిని వెలికితీసి కెసిఆర్ తదితరులను దోషులుగా నిలబెట్టి ఉంటే రేవంత్ ఇమేజ్ పెరిగేది. కానీ ఆరోపణలతోనే రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ రిపోర్టుపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను అరెస్టు చేస్తారేమో అన్నంతగా ప్రచారం జరిగింది. అంతా తుస్సుమంది. ఇప్పుడు కమిషన్ రిపోర్టుకు కూడా పెద్ద విలువ లేకుండా పోయిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు బారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నీరు నిల్వచేసి పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని తోడి ఆయా ప్రాంతాలలో ఉన్న రిజర్వాయిర్‌లను నింపాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇందుకు రేవంత్ ససేమిరా అనడంతో చంద్రబాబు కోసం గోదావరి జలాలలను కిందికి జారవిడుస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.

ఒక వైపు వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు నీరు ఎలా ఇవ్వవచ్చా అన్నదానిపై ఆలోచన చేసి ఉండాల్సింది. కేసీఆర్ కట్టించినంత మాత్రాన ఆ ప్రాజెక్టు కెసిఆర్‌ది అయిపోదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇప్పుడు రాజకీయంగా రేవంత్‌ను ఏకిపారేయడంలో బిఆరెస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. మంత్రులు అవినీతిలో కూరుకు పోయారని కెటిఆర్, హరీష్ రావులు రోజూ విమర్శలు చేస్తున్నారు. కమీషన్లు లేనిదే మంత్రులు కాలు బయటపెట్టడం లేదని అంటున్నారు. ఈ ఎదురుదాడితో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రకంగా ఆత్మరక్షణలో పడిపోయింది. సింగరేణి తదితర విషయాల్లో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. ఈ క్రమంలోనే వాదోపవాదాలు, విమర్శ, ప్రతి విమర్శలతో రాజకీయ వేడెక్కింది. అవినీతి అంటూ ఆరోపించిన రేవంత్ నిరూపించలేదు. దీనికి బదులుగా కేటీఆర్, హరీష్‌రావులే గట్టిగా బదులు ఇస్తున్నారు. దీనివల్ల కూడా రేవంత్ అసహనానికి గురి అవుతున్నారనిపిస్తోంది. ఒక వేళ నిజంగానే గోదావరి నీటిని లిఫ్ట్ చేయడంలో ఇబ్బంది ఉంటే, ఎన్‌డిఎస్ఎ నివేదికపై అఖిలపక్షం నిర్వహించి చర్చ చేయాలి. బారేజీల వద్దకు, పంప్ హౌస్‌ల వద్దకు రిటైర్డ్ ఇంజనీర్లను తీసుకునివెళ్లి ఇరిగేషన్ అధికారుల ద్వారా పరిస్థితిని వివరించాలి. కానీ ఇవేవీ చేయకపోవడంతో ఇప్పుడు కాళేశ్వరమే బిఆర్ఎస్‌కు ఆక్సిజన్ నింపుతోంది.

# చారిత్రక ఘట్టానికి ఈ ప్రయోగం నిదర్శనం

## ఇస్రోను అభినందించిన పవన్, లోకేశ్



**అమరావతి, జులై 18 :** విక్రమ్-1 రాకెట్ ప్రయోగంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ ప్రయోగాన్ని చరిత్రాత్మక ఘట్టంగా పవన్ కల్యాణ్ అభివర్ణించారు. భారత అంతరిక్ష రంగంలో తొలిసారిగా ఓ ప్రైవేట్ ఏరోస్పేస్ రూపొందించిన రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. 'విక్రమ్-1' రాకెట్, 'మిషన్ ఆగమన్' పేరుతో శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రంలో ఈ ప్రయోగాన్ని చేపట్టారు. భారతదేశం ఈ రోజు అంతరిక్ష రంగంలో మరో కీలక మైలురాయిని చేరుకుందని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన విక్రమ్-1 రాకెట్, అంతరిక్ష సాంకేతికత, ఆవిష్కరణల్లో ప్రపంచ అగ్రగామిగా నిలవాలనే భారతదేశ లక్ష్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ చరిత్రాత్మక ప్రయోగం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దార్శనికతకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. బారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా దేశంలో ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో ఇస్రో పోషించిన పాత్రను ప్రత్యేకంగా ప్రశంసించారు. శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక నైపుణ్యం, యువతలోని వ్యవస్థాపక స్ఫూర్తిని ప్రోత్సహించడంలో ఇస్రో కీలకంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. విక్రమ్-1 మిషన్ భారతీయ ప్రతిభ, శాస్త్రీయ సామర్థ్యం, ఆవిష్కరణల శక్తికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ధైర్యం, పట్టుదల, వినూత్న ఆలోచనలతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చనే సందేశాన్ని ఈ ప్రయోగం ప్రతి యువ భారతీయుడికి అందిస్తుందని చెప్పుకొచ్చారు. చరిత్రాత్మక విజయాన్ని సాధించేందుకు కృషి చేసిన స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్ సంస్థల బృందాలకు పవన్ కల్యాణ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విక్రమ్-1 మిషన్ విజయవంతంగా పూర్తై భారత అంతరిక్ష రంగానికి మరిన్ని విజయాలకు నాంది పలకాలని ఆకాంక్షించారు. భారతదేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే ఈ విజయగాథ రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలిచి, మరింత పెద్ద కలలు కనేందుకు యువతను ప్రేరేపించాలని పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. విక్రమ్-1 రాకెట్ ప్రయోగం విజయవంతమైందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## విక్రమ్-1' రాకెట్ ప్రయోగంపై చంద్రబాబు హర్షం

**అమరావతి,జులై18 :** 'విక్రమ్-1' రాకెట్ తొలి ప్రయోగంలోనే విజయం సాధించడంపై సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్‌లకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1 తొలి ప్రయోగంలోనే విజయవంతంగా కక్ష్యలోకి చేరడంతో భారత్ మరో చారిత్రక మైలురాయిని అధిగమించిందన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ దేశాలతో పోటీపడే స్థాయికి భారత ప్రైవేటు అంతరిక్ష రంగం ఎదిగిందని ఈ విజయం నిరూపించిందని వెల్లడించారు. ఇది భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన యుగానికి నాంది అని పేర్కొన్నారు. శాస్త్రీయ సంస్థల సామర్థ్యం, భారతీయ పారిశ్రామికవేత్తల సృజనాత్మకత కలిసినప్పుడు ఆవిష్కరణలకు కొత్త హద్దులు ఏర్పడతాయని ఈ ఘన విజయం చాటిచెప్పిందని సీఎం తెలిపారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్ సహా ఈ విజయాన్ని సాకారం చేసిన వేలాదిమంది శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, భాగస్వాములందరికీ అభినందనలు తెలియజేశారు.

# హర్మ్యూజ్‌లో సీమైన్స్ ఢీకొని.. పేలిన చమురు ట్యాంకర్లు : ఐఆర్‌జీసీ



**టెహ్రాన్ :** పశ్చిమాసియా కొన్నిరోజులుగా దద్దరిల్లుతూనే ఉంది. ఇంధన రవాణాకు కీలకమైన హర్మ్యూజ్ జలసంధిలో అంతరా యాలు కొనసాగుతున్నాయి. తమ హెచ్చరికలు పట్టించుకోని నౌకలపై ఇప్పటికే అమెరికా-ఇరాన్ దాడులు చేస్తుంటే.. మందు పాతరలు మరో ముప్పుగా మారాయి. యుద్ధం ప్రారంభమైన సమయంలో ఇరాన్ వాటిని హర్మ్యూజ్‌లో పరిచిన సంగతి తెలిసిందే. రెండు చమురు ట్యాంకర్లు వాటిని ఢీకొట్టడంతో పేలిపోయాయని శనివారం ఐఆర్‌జీసీ వెల్లడించింది. "కొద్దిసేపటి క్రితం హర్మ్యూజ్‌లో ముందుపాతరలు ఉన్న ప్రాంతం మీదుగా వెళ్లిన రెండు చమురు ట్యాంకర్లు పేలిపోయాయి. అమెరికా నిఘా సంస్థలు ఇచ్చిన సమాచారంతో ఈ నౌకల సదరు మార్గం మీదుగా ప్రయాణించాయి" అని ఐఆర్‌జీసీ ప్రకటించింది. అలాగే ఈ జలమార్గం మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించిన నాలుగు నౌకలను అడ్డుకున్నామని వెల్లడించింది. మరోవైపు ఏడోరోజు ఇరాన్‌పై దాడులు కొనసాగాయి. దాంతో దక్షిణ ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇలాగే మరో రెండు, మూడు రోజులు దాడులు కొనసాగితే తాము పూర్తిస్థాయి ఘర్షణకు దిగుతామని ఇరాన్ హెచ్చరించింది. "మేము దీటుగా స్పందిస్తాం. అలాగే ఏ సరిహద్దు కూడా సురక్షితంగా ఉండదు" అని పేర్కొంది. యూఎస్ స్థావరాల లక్ష్యంగా ప్రతీకార దాడుల్ని కొనసాగించింది. కువైట్, జోర్డాన్‌పైకి క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. తమ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. ఎర్రసముద్రంలోని బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసివేసేందుకు సిద్ధంగా ఉండాలని ఇరాన్ హూతీ రెబెల్స్‌ను కోరింది. అయినా సరే అమెరికా ఆ మౌలిక సదుపాయాలను టార్గెట్ చేసింది. ఇరాన్-హూతీలు కలిసి ఆ జలసంధి మీదుగా జరిగే సముద్ర వాణిజ్యానికి అంతరాయం కలిగించాలని నిర్ణయించుకుంటే.. తీవ్ర ఉద్రికత్తలకు దారితీయొచ్చని గతంలో యూఎస్ విదేశాంగశాఖలో పనిచేసిన కల్నల్ అబ్బాస్ దహూక్ ఆందోళన వ్యక్తంచేశారు.



# పర్యావరణవేత్త వాంగ్‌చుక్ ఆస్పత్రికి తరలింపు

## హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం

## సప్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స

**న్యూఢిల్లీ, జూలై 18 :** దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 21 రోజులుగా నిరాహారదీక్ష చేస్తోన్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శపోలీసులు బలవంతంగా శనివారం ఆసుపత్రికి తరలించారు. ఆయనకు తగిన వైద్యసహాయం అందించాలంటూ దిల్లీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో నిరసన ప్రాంతం నుంచి పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారు. ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణించింది. ఆయన్ను సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. కోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను తరలిస్తోన్న సమయంలో నిరసనకారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులు శాంతియుతంగా వ్యవహరించా లని, వీలైనంత త్వరగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని కోరుతున్నామని దిల్లీ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తన అనుమతి లేకుండా తన భర్తకు ఎలాంటి చికిత్సా అందించొద్దని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె ఆంగ్మో డిమాండ్ చేశారు. ఆయన సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. నా అనుమతిలేకుండా చికిత్స ప్రారంభించవద్దు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రతిఒక్కరిని బాధ్యుల్ని చేస్తాను. ఆయన నిన్న బాగానే కనిపించారు. ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం లేదు. మా వైద్యుడి అనుమతి లేకుండా ఏ చికిత్సా అందించడానికి వీలు లేదు. అది మా హక్కు అని మీడియాతో మాట్లాడారు.

# వాంగ్‌చుక్ తరలింపుతో దీక్షకు దిగిన దీప్కే

## ఈ ఉద్యమం ఎట్టి పరిస్థితుల్లో ఆగిపోదని వెల్లడి

## 20న సంసద్ మార్చ కొనసాగుతుందని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, జూలై 18 :** పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో ఈ ఉద్యమం ఆగిపోదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఇక నుంచి తాను నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. ఈ రోజు నుంచి దీక్ష ప్రారంభిస్తున్నాను. వెనకడుగు వేయొద్దని మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రతి ఒక్కరు జంతర్‌మంతర్‌కు రావాలని కోరుతున్నాను. జులై 20న జరగాల్సిన పాదయాత్రను కొనసాగిస్తాం అని వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని వారాల క్రితం కాక్రోచ్ పార్టీ తొలుత దిల్లీలో నిరసనలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించారు. జులై 20న పార్లమెంట్‌కు శాంతియుత మార్చ్ 'చలో సంసద్'ను నిర్వహించనున్నట్లు కాక్రోచ్ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఆ రోజునే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం వాంగ్‌చుక్‌ను ఉంచిన సప్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రకటన విడుదల చేశారు. నిరాహార దీక్ష కారణంగా ఆయన బలహీనపడ్డారు. డీహైడ్రేషన్‌కు గురయ్యారు. నిరంతర వైద్యపర్యవేక్షణ, చికిత్స అందిచాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. మరోవైపు ఆసుపత్రిలోకి ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించకపోవడంతో అక్కడి సిబ్బందిపై వాంగ్‌చుక్ భార్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వాంగ్‌చుక్ వైద్య పరీక్షల వివరాల కాపీ ఇవ్వకపోవడానికి కారణం ఏంటని ప్రశ్నించారు.



# బాణసంచా కర్మాగారంలో పేలుడు..

## ఎనిమిది మంది మృతి

**అహ్మదాబాద్, జూలై 18 :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. నగర శివారులోని రామోల్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 10 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఫ్యాక్టరీ లైసెన్సు రద్దు చేసినప్పటికీ.. అక్కడ అక్రమంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, ఈ క్రమంలోనే ఓ యూనిట్‌లో పేలుడు సంభవించినట్లు సమాచారం. ఘటనాస్థలికి చేరుకున్న రెస్క్యూ బృందాలు.. సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.


# మా ఉద్యమం ఆగదు..

## నిరాహార దీక్షకు దిగిన అభిజీత్ దీప్కే



**న్యూఢిల్లీ, జూలై 18 :** పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో ఈ ఉద్యమం ఆగిపోదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఇక నుంచి తాను నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. "ఈ రోజు నుంచి దీక్ష ప్రారంభిస్తున్నాను. వెనకడుగు వేయొద్దని మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తు న్నాను. ప్రతి ఒక్కరు జంతర్ మంతర్‌కు రావాలని కోరుతున్నాను. జులై 20న జరగాల్సిన పాదయాత్రను కొనసాగిస్తాం" అని వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని వారాల క్రితం కాక్రోచ్ పార్టీ తొలుత దిల్లీలో నిరసనలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించారు. జులై 20న పార్లమెంట్‌కు శాంతియుత మార్చ్ 'చలో సంసద్'ను నిర్వహించనున్నట్లు కాక్రోచ్ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఆ రోజునే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం వాంగ్‌చుక్‌ను ఉంచిన సప్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రకటన విడుదల చేశారు. " నిరాహార దీక్ష కారణంగా ఆయన బలహీనపడ్డారు. డీహైడ్రేషన్‌కు గురయ్యారు. నిరంతర వైద్యపర్యవేక్షణ, చికిత్స అందిచాల్సిన అవసరం ఉంది" అని వెల్లడించారు. మరోవైపు ఆసుపత్రిలోకి ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించకపోవడంతో అక్కడి సిబ్బందిపై వాంగ్‌చుక్ భార్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వాంగ్‌చుక్ వైద్య పరీక్షల వివరాల కాపీ ఇవ్వకపోవడానికి కారణం ఏంటని ప్రశ్నించారు.

# విద్యార్థులకు ఇలాంటి పరిస్థితి బాధాకరం : మనుబాకర్



**న్యూఢిల్లీ, జూలై 18 :** నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు భారత స్టార్ షూటర్, ఒలింపిక్ పతక విజేత మను బాకర్ మద్దతు తెలిపారు. సామాజిక మాధ్యమ వేదికగా ఆమె స్పందించారు. ఇది రాజకీయాల గురించి చేస్తున్న ఆందోళన కాదని.. దేశ భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. తాను కూడా ఒక విద్యార్థినేనని, ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి వచ్చిన వారేనని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడం ప్రాథమిక హక్కు అని తెలిపారు. విద్యార్థుల కలలు, ప్రతిభ, భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం ఎంతో బాధ కలిగిస్తోందని పేర్కొన్నారు. మరోవైపు.. బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌కు మద్దతు ప్రకటించారు. విద్యార్థుల సమస్యలపై వాంగ్‌చుక్ వ్యక్తం చేస్తున్న ఆందోళనతో ఏకీభవిస్తున్నానని తెలిపారు. కష్టపడి చదివే విద్యార్థులకు న్యాయం జరగాలని, పరీక్షలపై ప్రజల్లో విశ్వాసం కలిగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



# కోట్ల రూపాయల ఫీజు బకాయిలు విడుదల చేయాలి

**బిసి పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ అధ్యక్షులు అరవింద్ చారి**

**నాగర్ కర్నూల్,జులై 19(జనంవార్త) :** 8000 వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలని బిసి పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన బిసి పొలిటికల్ జేఏసీ విద్యార్థుల ముఖ్య నాయకుల సమావేశంలో దన్నోజు అరవింద చారి ముఖ్యంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలని,జీవో నెం ఆర్.ఆర్ యాక్ట్ ను రద్దు చేసి,14 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా కావడంతో స్కాలర్ షిప్స్,ఫీజు రీఎంబర్స్మెంట్ పాత బకాయిలు పెండింగ్లో ఉన్నవి విడుదల చేసి విద్యార్థుల అంధకార భవిష్యత్తు జ్ఞాన రూపం లోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ విద్యార్థి నాయకులు పూజ,సౌమ్య,సాయి శ్రీజ, సరస్వతి,లావణ్య, నవనీత,శివాని,స్రవంతి, కవిత,పల్లవి,మల్లేష్, గౌతమ్,మేఘనాథ్,తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులకు యూనిఫామ్, నోట్ బుక్స్ పంపిణీ

- అనంతరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో విద్యార్థులకు చేయూత
- విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటవేసేది ఉపాధ్యాయులే : మాధవరెడ్డి

**దుబ్బాక, జూలై 18 (జనం వార్త) :** విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటవేసేది ఉపాధ్యాయులేనని అనంతరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ అధినేత మాధవరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గుర్రప్ప వారి మాధవరెడ్డి సహకారంతో స్కూల్ యూనిఫామ్,నోట్ బుక్స్, బ్యాగులు,ఐడి కార్డులను శనివారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులతో కల్పించడంతోపాటు నాణ్యమైన విద్య బోధన అందించేందుకు కృషి కృషి చేస్తున్న అనంతరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ అధినేత మాధవ రెడ్డి సేవలు అభినందన నియమని అల్వాల ఉప సర్పంచ్ తుడుము సాయిలు,ట్రస్ట్ డైరెక్టర్ పోల్ రెడ్డి దిలీప్ రెడ్డి, మాజీ సర్పంచ్ గుర్రప్ప గారి రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా మాధవ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో వసతులు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన తోపాటు పౌష్టిక ఆహారం అందించేలాగా కృషి చేయడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అల్వాల గ్రామం ఉప సర్పంచ్ తుడుము సాయిలు అనంతరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ డైరెక్టర్ దిలీప్ రెడ్డి మాజీ సర్పంచ్ గుర్రప్ప గారి రాజిరెడ్డి వార్డు సభ్యులు పిల్లల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పలువురు పాల్గొన్నారు.

# గుంటూరు ఘటనపై చంద్రబాబు ఆగ్రహం

- కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆదేశం
- పార్టీ వారైనా క్షమించేది లేదని వెల్లడి
- ఘటనపై కఠిన చర్యలు తప్పవన్న లోకేశ్



**అమరావతి, జూలై 18 :** గుంటూరు ఘటనను సీరియస్‌గా తీసుకో వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. సమా జంలో ఏ ఒక్క మహిళకు అవమా నం జరిగినా.. అది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. సమా జంలో ఇలాంటి వాటికి తావులేదని తెలిపారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, దోషులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశిం చారు. ఈ దారుణానికి సంబంధించి ఇప్పటికే క్రిమినల్ కేసు నమోదైందని, నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. ఈ ఉదంతంలో ప్రమేయం ఉన్న సదరు పార్టీ కార్యకర్తను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామన్నారు. రాజకీయ అండదండలు ఉన్నా సరే.. చట్టం వదిలిపెట్టదని సీఎం స్పష్టంచేశారు. తప్పు చేసిన వారి విషయంలో ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. చట్టం ఎవరికీ లొంగదు, పక్షపాతం చూపదన్నారు. రాజకీయ పలుకుబడి లేదా పార్టీతో అనుబంధం ఉందనే కారణంతో ఏ ఒక్కరికీ రక్షణ లభించదని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి మహిళకు తమ గౌరవానికి, భద్రతకు ఎల్లప్పుడూ రక్షణ ఉంటుందనే నమ్మకాన్ని కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. ఈ ఘటనలో నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న పార్టీ కార్యకర్తపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు.భయం, పక్షపాతం లేకుండా చట్టాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఏపీ మహిళల గౌరవం, భద్రతకు తాము కట్టుబడి ఉంటామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గుంటూరు ఘటనపై ఆంధప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. రాజకీయ పలుకుబడి ఎవరినీ కాపాడదని చెప్పుకొ చ్చారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ పోస్టు పెట్టారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న నాయకుడిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు. పార్టీ పదవులన్నింటి నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. మహిళలను అవమానిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలకు తమ ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తుందని స్పష్టం చేశారు.

# శ్రీరామ్ నగర్‌లో ఎస్ఐఆర్‌పై అవగాహన శిబిరం

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలరామ్ యాదవ్**

**శేరిలింగంపల్లి, జూలై 18 (జనంవార్త) :** శేరిలింగంపల్లి సీనియర్ నియోజకవర్గం పరిధిలోని శ్రీరామ్ నగర్ ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సహాయ శిబిరాన్ని శనివారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ జాబితా సవరణ "సార్" కార్యక్రమంలో శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలరామ్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా బలరామ్





యాదవ్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు ధృవీకరించుకోవాలని సూచించారు.పేరు లేకపోతే కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే నమోదైన వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమని,ప్రతి అర్హుడూ తన ఓటు హక్కును వినియోగించుకునేలా అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజమోహన్ రావు, నాగరాజ్ యాదవ్,సన్నీ యాదవ్,వెంకటేశ్వర్లు, ప్రేమ్ సాయి, మల్లికార్జున్,రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి కోర్టు నుండి పటాన్ చేరు వరకు రెండో బస్సు సర్వీస్

**కూకట్‌పల్లి, జూలై 18, (జనం వార్త) :** కూకట్‌పల్లి కోర్టు నుండి పటాన్ చేరు వరకు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సౌకర్యార్థం ఆర్టీసి అధికారులు రెండో బస్సు సర్వీస్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ సభ్యుల వినతి మేరకు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సౌకర్యార్థం ఆర్టీసి అధికారులు రెండో బస్సు సర్వీస్ ను ప్రారంభించడం హర్షణీయమన్నారు. ఈ బస్సు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు పటాన్‌చెరు లో బయలుదేరి ఆర్‌సీ పురం, బీరంగూడ ఆర్చ్, అశోక్‌నగర్, భెల్ జంక్షన్, చందానగర్, గంగారం, మదీనాగూడ, ఆల్విన్ కాలనీ ఎక్స్ రోడ్స్, మియాపూర్, హైదర్‌నగర్, జేఎన్‌టీయూ, లులు మాల్, నెక్సస్ మాల్, మలేషియన్ టౌన్‌షిప్, 9వ ఫేజ్ మీదుగా





ఉదయం 10:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టుకు చేరుకుంటుందన్నారు. సాయంత్రం 5 గంటల 15 నిమిషాలకు కూకట్‌పల్లి కోర్టు నుంచి బయలుదేరి అదే మార్గంలో సాయంత్రం 6 గంటల 15 నిమిషాలకు పటాన్‌చెరు చేరుకుంటుందన్నారు. ఈ బస్సు రవాణా సౌకర్యాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందరూ సద్వినియోగం చేసుకుని, బస్సు సేవ విజయవంతంగా కొనసాగేందుకు సహకరించాలని బార్ అసోసియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడానికి సహకరించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బార్ కౌన్సిల్ సభ్యుడు అశోక్ గౌడ్, గౌరవ న్యాయాధికారి,ఆర్టీసీ అధికారులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి. పి, ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ గౌడ్,కార్యవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సిసి రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ కన్నయ్యగారి లక్ష్మి

**.ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతోనే గ్రామ అభివృద్ధి**

**దుబ్బాక, జూలై 18 (జనం వార్త) :** దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని గ్రామ సర్పంచ్ కన్నయ్యగారి లక్ష్మి పేర్కొన్నారు. తొగుట మండలంలోని గుడికందుల గ్రామంలోని ఎస్సీ కాలనీకి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కృషితో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరు చేయించిన 10 లక్షల రూపాయలతో శనివారం సిసి రోడ్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తూ తమ పాలకవర్గం ఎన్నికయ్యా మొదలుకొని ఇప్పటి వరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. రాజకీయాలకతీతంగా గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు





సహకరించాలని కోరారు. రాబోయే రోజులలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. మౌలిక సదుపాయాలను పూర్తి చేసి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గ్రామ పరిధిలోని ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కన్నయ్య హరి కృష్ణారెడ్డి,ఉప సర్పంచ్ పర్శయ్య,పంచాయతీ కార్యదర్శి రవి,వార్డ్ సభ్యులు ధావుల గళ్ళ కృష్ణ,బేజుగామ మహేష్, బంగారుగళ్ల ఈశ్వర్, ఉప్పరి కమలాకర్, హనుమండ్ల కాడి మధుసూదన్ రెడ్డి,మాజీ సర్పంచ్ మల్లయ్య, నాయకులు ఎల్లం, శ్రీకాంత్,బేజుగామ రాజు తదితరులు పాల్గొన్నారు.

# తుంగభద్ర పరివాహక రాష్ట్రాలతో భేటీ

**27న హైదవర్ కమిటీ తొలి సమావేశం**

**అమరావతి, జూలై 18 :** తుంగభద్ర పరీవాహక ప్రాంతంలోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర అధ్యయనం కోసం కేంద్రం ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ తొలిసారిగా ఈనెల 27న ఢిల్లీలో కేంద్ర జలసంఘం కార్యాలయంలో సమావేశం కానుంది. సీడబ్ల్యూసీ సభ్యుడుయోగేష్ పైథంకర్ అధ్యక్షతన ఏపీ ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, కర్ణాటక జలవనరుల శాఖ కార్యదర్శి బీఎస్ శివశంకర్, తెలంగాణ ఈఎన్‌సీ ఓవీ రమేష్ బాబు, సీడబ్ల్యూసీ సీఈలు అభిషేక్ బెనర్జీ, సంజయ్ గంగ్వార్, శరబ్‌జీత్‌సింగ్ భక్షీ, ఓంప్రకాష్ గుప్తా సభ్యులుగా ఉన్న ఈ కమిటీకి తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఆస్మా ఖాతూన్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. గత నెల 25న తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్లు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తోపాటు ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ హాజరై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుంగభద్ర జలాల వినియోగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించా రు. వాటిపై సమగ్రంగా అధ్యయనం చేసి బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు లోబడి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇచ్చేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటించారు. ఆ మేరకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఈనెల 11న కేంద్ర జల్ శక్తి శాఖ జాయింట్ కమిషనర్ సంజయ్‌కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడు అంశాలపై అధ్యయనం చేసి ఆర్నెల్లలోగా నివేదిక ఇవ్వాలని ఆ కమిటీని నిర్దేశిరచారు. తుంగభద్ర హైపవర్ కమిటీ అధ్యయనం చేసే అంశాలివీ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) కింద చారిత్రక వినివియోగం, నీటి అవసరాలు, నిర్వహణలో ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితిపై అధ్యయనం చేస్తారు. తుంగభద్ర డ్యాంలో ఏ మేరకు పూడిక చేరింది..? దాని వల్ల నీటి నిల్వ సామర్థ్యం ఎంత తవిగ్గింది..? సాగు, తాగునీటి అవసరాలు, జలవిద్యుదు త్పత్తిపై ఏ మేరకు ప్రభావం పడుతోంది..? డ్యామ్ భద్రత, వరద నియంత్రణ చర్యలపై సూచనలు చేస్తారు.




# పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఏపీ అత్యంత సురక్షితం

- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్
- "ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026"కు ముఖ్య అతిథిగా మంత్రి
- సింగిల్ విండో విధానం ద్వారా శరవేగంగా పర్యాటక అనుమతులు

**అమరావతి, జులై 18 :** భారతదేశ దేశీయ పర్యాటక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యంత కీలకమైన భూమిక పోషిస్తోందని, పర్యాటక రంగాన్ని ఒక వ్యూహాత్మక ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం న్యూఢిల్లీలోని చాణక్యపురి 'హోటల్ జింజర్' వేదికగా అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన "ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "స్వదేశీ పర్యటన్ ? సశక్త్ భారత్" అనే ప్రధాన ఇతివృత్తంతో.. ఆంధ్రప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలపై ప్రత్యేక ఫోకస్‌తో జరిగిన సదస్సు లో మంత్రి దుర్గేష్ కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, పర్యాటకరంగ సేవల్లో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎడిటిఓఐ సంస్థకు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 2,400 మందికి పైగా సభ్యులతో విస్తరించిన ఈ జాతీయ నెట్‌వర్క్, భారతీయ పర్యాటక రంగాన్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అరకు లోయ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలను ఏడు ప్రధాన పర్యాటక హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికం, తీరప్రాంతం (కోస్టల్), పర్యావరణం (ఎకో), బౌద్ధ వారసత్వం, గ్రామీణ సంస్కృతి కలగలిసిన అరుదైన పర్యాటక అనుభూతి ఆంధ్రప్రదేశ్ సొంతమని పేర్కొన్నారు. తిరుపతి, శ్రీశైలం వంటి దివ్యక్షేత్రాల నుండి అరకు లోయ అందాలు, గండికోట గ్రాండ్ కాన్యన్, బెలుం గుహల వరకు ఎన్నో అద్భుతాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. పర్యాటక రంగం కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా గ్రామాలు, తీరప్రాంతాలు, గిరిజన ప్రాంతాల వరకు విస్తరించి మహిళలకు, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని, స్థానిక వంటకాలు మరియు చేతివృత్తులకు ప్రాచుర్యం తెస్తుందని మంత్రి దుర్గేష్ నొక్కి చెప్పారు. అమరావతి, నాగార్జునకొండ, తొట్లకొండ, బొజ్జన్నకొండ వంటి బౌద్ధ వారసత్వ ప్రదేశాలతో పాటు విజయవాడ, శ్రీకాళహస్తి క్షేత్రాలను, కోనసీమ గ్రామీణ పర్యాటకాన్ని, మారేడుమిల్లి, కోరింగ వంటి పర్యావరణ పర్యాటక కేంద్రాల ప్రాధాన్యతను మంత్రి వివరించారు.ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కలంకారీ కళలు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, ఉప్పాడ-ధర్మవరం చేనేత వస్త్రాలు మరియు అరకు కాఫీ వంటి విశిష్ట ఉత్పత్తులను టూరిజం ప్యాకేజీలలో భాగం చేయాలని కోరారు. పర్యాటకులు ఏపీని కేవలం చూడటమే కాదు... ఇక్కడి సంస్కృతిని అనుభవించేలా చేయాలన్నారు. పర్యాటకులు ఎక్కువ రోజులు బస చేసేలా, ఎక్కువ ఖర్చు పెట్టేలా సరికొత్త హోమ్‌స్టేలు, ఎకో-లాడ్జ్‌లు, కారవాన్ టూరిజం మరియు అడ్వెంచర్ టూరిజం వంటి మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎడిటిఓఐ జాతీయ అధ్యక్షుడు వేద్ ఖన్నా, సంస్థ ముఖ్య ప్రతినిధులు, దేశంలోని వివిధ రాష్ట్రాల చాప్టర్ల ఛైర్మన్లు, పర్యాటక, హోటల్ రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోదావరి నదిలో వేటకెళ్లి ఐదుగురు మృతిపై సీఎం చంద్రబాబు విచారం

**అమరావతి, జూలై 18 :** పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు గల్లంతయ్యారన్న విషయంపై ముఖ్యమంత్రి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెంనకు చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేష్ అనే ఐదుగురు వేటకు వెళ్లి మృత్యువాత పడినట్లు అధికారులు సీఎంకు వివరించారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఐదుగురు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలవరం జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకి దిశానిర్దేశం చేశారు.

# ఐదుగురు మృతి ఘటనపై దిగ్భ్రాంతి

**డిప్యూటీ సిఎం పవన్, హోంమంత్రి అనిత సంతాపం**

**అమరావతి,జూలై18 :** పోలవరం జిల్లా ఏటపాక మండల పరిధిలోని గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు మృతి చెందిన ఘటన దిగ్భ్రాంతి కలిగించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పోలవరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నట్లు చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు దిశానిర్దేశర చేశామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. గోదావరి నదిలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మృతిచెందిన ఐదుగురి కుటుంబాలకు హోంమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయ చర్యలు అందేలా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆకాంక్షించారు.




# మేడ్చల్ బస్‌స్టేషన్ దుస్థితి

## అధికారులు ఎప్పుడు మేల్కొంటారో...

**దుర్గంధపూరితంగా మేడ్చల్ బస్ స్టేషన్**

**మురుగునీటితో కంపు కొడుతున్న బస్ స్టాప్**

**ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**

**చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**మేడ్చల్,జూలై 19(జనంవార్త) :** మేడ్చల్ జిల్లా,జీహెచ్ఎంసీ పరిధిలోని మేడ్చల్ ప్రధాన బస్‌స్టేషన్ ప్రస్తుతం డ్రైనేజీ మురుగు నీటితో నిండిపోయి దుర్గంధానికి నిలయంగా మారింది. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ బస్‌స్టేషన్‌లో అడుగు పెట్టాలంటేనే ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ మురుగునీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వైరల్ ఫీవర్, డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా ఇదే దుస్థితి కొనసాగుతున్నా సమస్య పరిష్కారానికి ఎలాంటి శాశ్వత చర్యలు చేపట్టకపోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ప్రతిరోజూ చిన్నారులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు,విద్యార్థులు ఈ బస్‌స్టేషన్‌ను ఉపయోగిస్తున్నప్పటికీ కనీస పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడం అధికార యంత్రాంగ నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ఆరోపిస్తున్నారు.ప్రజల డిమాండ్:మేడ్చల్ బస్‌స్టేషన్‌లో పేరుకుపోయిన డ్రైనేజీ నీటిని వెంటనే తొలగించి, పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, దోమల నివారణ కోసం ప్రత్యేక చర్యలు అమలు చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను శాశ్వతంగా సరిచేసి ప్రజలకు పరిశుభ్రమైన బస్‌స్టేషన్‌ను అందించాలని స్థానికులు, ప్రయాణికులు ప్రభుత్వాన్ని మరియు సంబంధిత అధికారులను కోరుతున్నారు."ప్రజల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై బాధ్యత ఎవరు తీసుకుంటారు? సమస్య మరింత తీవ్రమయ్యేలోపు ప్రభుత్వం,అధికారులు తక్షణమే స్పందించాలి" అని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.







# కాస్త దిగొచ్చిన బంగారం.. పెరిగిన వెండి

బంగారం ధర కాస్త దిగొచ్చింది. అంతర్జాతీయ ధరలను అనుసరించి హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పుత్తడి ధర రూ.1,43,400కు చేరింది. పది గ్రాముల ధర ఒక్కరోజులో రూ.2,000 వరకు తగ్గింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,31,350గా ఉంది. అదే సమయంలో వెండి మాత్రం పెరిగింది. రూ.3 వేలకు పైగా పెరిగి, 2,25,000కి చేరింది. అంతర్జాతీయంగా ఔన్సు పసిడి ధర 4,019.05 డాలర్లకు చేరుకోగా.. వెండి 55.99 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు తీవ్రమైన నేపథ్యంలో ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. ఇదే సమయంలో డాలర్ బలోపేతం కావడంతో, బాండ్ రాబడులు వృద్ధి చెందుతు న్నాయి. ద్రవ్యోల్బణం అధికమవుతుందనే ఆందోళనలు చుట్టుముడుతు న్నాయి. ఈ అంశాల కారణంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను దీర్ఘకాలం పాటు అధికంగానే ఉంచొచ్చనే సంకేతాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యం లోనే బంగారం, వెండి ధరల్లో ఊగిసలాట కనిపిస్తోంది.





## బిజినెస్





## రిలయన్స్ లాభం 20,946 కోట్లు..

ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి రూ.20,946 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది రూ.26,994 కోట్లతో పోలిస్తే లాభంలో 22 శాతం తగ్గుదల నమోదైంది. అయితే, గతేడాది తొలి త్రైమాసింలో ఏషియన్ పెయింట్స్‌లో (రూ.8,924 కోట్లు) రిలయన్స్ తన వాటాలు విక్రయించడం వల్ల వన్‌టైమ్ గెయిన్ కింద లాభంలో భారీ వృద్ధి నమోదైంది. దాన్ని మినహాయిస్తే ఓ2సీ, రిటైల్, డిజిటల్ వ్యాపారాలు రాణించడంతో మెరుగైన ఫలితాలను కంపెనీ ప్రకటించింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 25 శాతం వృద్ధి చెందింది. గతేడాది ఇదే సమయంలో రూ.2.48 లక్షల కోట్లుగా ఉన్న ఆదాయం రూ.3.11 లక్షల కోట్లకు పెరిగినట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. రిలయన్స్ డిజిటల్ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ మరోసారి త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టింది. క్యూ1లో రూ.7,764 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాదితో పోల్చినప్పుడు 9 శాతం వృద్ధిని నమోదు చేసింది. 12 శాతం వృద్ధితో రూ.39,173 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. సమీక్షా త్రైమాసికంలో యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం (ఆర్పు) రూ.215.6కి పెరిగింది. సగటు డేటా వినియోగం నెలకు 43.7 జీబీకి చేరినట్లు కంపెనీ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ 89 లక్షల మంది కొత్త సబ్‌స్క్రైబర్లను చేర్చుకుంది.

# లార్డ్స్ వన్డే రోహిత్‌కు చివరిది కాదు

### వన్డే జట్టులో అతడు రెగ్యులర్ సభ్యుడు

### మీడియాలో వస్తోన్నవన్నీ అవాస్తవాలే

### సెలక్టర్లు ఎటువంటి పరిస్థితుల్లోనైనా మీడియాతో సంభాషించవద్దు

### బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా కీలక వ్యాఖ్యలు



**భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ లార్డ్స్ వేదికగా తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడేస్తాడంటూ ప్రచారం సాగుతోంది. గౌతమ్ గంభీర్ - రోహిత్ మధ్య సంబంధాలు దెబ్బతినడంతోనే వన్డే ప్రపంచ కప్ ప్రణాళికల్లో హిట్‌మ్యాన్ లేడని చర్చ మొదలైంది. ఆదివారం ఇంగ్లాండ్‌తో టీమ్‌ఇండియా మూడో వన్డే మ్యాచ్ ఆడనుంది. అందులో సెంచరీ చేసి రోహిత్ ఆటకు ఘన వీడ్కోలు పలకుతాడనేది కొందరి వాదన. కానీ, బీసీసీఐ ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియా మాత్రం వాటన్నింటిని కొట్టిపడేస్తూ పీటీఐతో కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియాలో వస్తోన్నవన్నీ అవాస్తవాలేనని స్పష్టం చేశారు.**

"రోహిత్ శర్మ భవిష్యత్తు గురించి పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. సోషల్ మీడియాలో వస్తోన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఆదివారం లార్డ్స్‌లో ఆడేది రోహిత్ కెరీర్‌లో చివరి మ్యాచ్ కాదు. మేనేజ్‌మెంట్ ఆ దిశగా చర్చించలేదు. భారత్ తరఫున రోహిత్ కొనసాగుతాడు. ముమ్ముందు సిరీస్‌లకూ అతడు అందుబాటులో ఉంటాడు. వన్డే జట్టులో అతడు రెగ్యులర్ సభ్యుడు. మీడియాలో వచ్చే ఊహాగానాలను అభిమానులు నమ్మొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. టీమ్‌ఇండియాకు రోహిత్ శర్మ సేవలు కొనసాగుతాయి. జట్టు ప్రణాళికల్లో ఉన్నంత కాలం అతడు ఉంటాడు" అని దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. మరోవైపు రోహిత్‌కు సంబంధించిన సమాచారం బయటకు రావడంపై బీసీసీఐ అసహనం వ్యక్తం చేసింది. ఎటువంటి పరిస్థితుల్లోనైనా మీడియాతో సంభాషించవద్దని సెలక్టర్లకు సూచించింది. ఇప్పటికే టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్ లక్ష్యం వచ్చే వన్డే ప్రపంచ కప్‌లో ఆడి విజేతగా నిలవడం. అతడి కెరీర్‌లో ఇదొక్కటే ఇప్పుడు లోటు. టీ20 వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీని కెప్టెన్‌గా జట్టుకు అందించాడు. ఇప్పటికే సారథ్యం నుంచి వైదొలగిన రోహిత్ కనీసం ఆటగాడిగానైనా కప్పును సాధించాలని చూస్తున్నాడు. కానీ, గంభీర్ - అజిత్ అగార్కర్ మాత్రం 40 ఏళ్లకు చేరువ కాబోతున్న రోహిత్ ప్లేస్‌లో యువ ఆటగాడు యశస్వి జైస్వాల్‌ను సిద్ధం చేయాలని చూస్తున్నారు. దీంతో గత రెండు మ్యాచుల్లో పెద్దగా రాణించని రోహిత్ లార్డ్స్ మ్యాచ్ తర్వాత వన్డేలకూ వీడ్కోలు పలుకుతాడని చర్చ మొదలైంది. ఇప్పుడు సైకియా వ్యాఖ్యలతో రోహిత్ భవిష్యత్తుపై అభిమానుల్లో అనుమానాలు తీరిపోవడం ఖాయం.



## స్మార్ట్‌ఫోన్లకు ధరల దెబ్బ..

దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది. ధరల పెరుగుదల కారణంగా వినియోగదారుల నుంచి డిమాండ్ తగ్గడంతో స్మార్ట్‌ఫోన్ సరఫరాలు తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది జూన్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో స్మార్ట్‌పోన్ మార్కెట్ 10 శాతం క్షీణతను నమోదు చేసింది. గడిచిన ఆరేళ్లలో రెండో త్రైమాసికంలో ఇంతటి భారీ తగ్గుదల కనిపించడం ఇదే తొలిసారని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఏఐ నుంచి డిమాండ్ కారణంగా స్మార్ట్‌ఫోన్ మెమొరీ విడిభాగాల ధరలు ఈ ఏడాది విపరీతంగా పెరిగాయి. దీంతో మొబైల్ కంపెనీలు తమ స్మార్ట్‌ఫోన్ ధరలను దాదాపు 15 శాతం మేర పెంచాయి. ముఖ్యంగా బడ్జెట్ సెగ్మెంట్ (రూ. 15వేల లోపు) ఫోన్ల విక్రయాలు దాదాపు 45 శాతం మేర పడిపోయాయని కౌంటర్‌పాయింట్ నివేదిక వెల్లడించింది. దీంతో చాలా కంపెనీలు మాస్ మార్కెట్‌కు చేరువయ్యేందుకు 4జీ స్మార్ట్‌ఫోన్లపై దృష్టి సారిస్తున్నాయని తెలిపింది. అల్ట్రా ప్రీమియం స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్ (రూ.45వేలు పైబడి) ఫోన్లు మాత్రం విక్రయాలు మాత్రం స్థిరంగా ఉన్నాయని నివేదిక తెలిపింది. మెరుగైన ఫైనాన్సింగ్ ఆప్షన్లు ఇందుకు కారణమని పేర్కొంది. బడ్జెట్ ఫోన్ల అమ్మకాలు తగ్గడంతో చైనా మొబైల్ బ్రాండ్ల మొత్తం మార్కెట్ వాటా భారీగా క్షీణించినట్లు వెల్లడించింది.





## యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు..

డిజిటల్ చెల్లింపులు మన దైనందిన ఆర్థిక జీవితంలో అంతర్భాగంగా మారిపోయాయి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) మంచి ఆదరణ పొందింది. డిజిటల్ రంగంలో భారత్‌ను అగ్రగామిగా నిలిపింది. అయితే, ప్రస్తుతం యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధిస్తే ఆ ప్రభావం ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోంది. యూపీఐ లావాదేవీలు చేసే వ్యాపారులపై మర్చంట్ డిస్కౌంట్ రేటును ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొనడమే ఇందుకు నేపథ్యం. ఎండీఆర్ ఛార్జీలు 0.5 శాతం కంటే తక్కువగా ఉంటాయని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎండీఆర్ ఛార్జీలపై పరిశ్రమల నిపుణుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదనపు భారంతో పాటు కస్టమర్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా దీర్ఘకాలంలో యూపీఐ వినియోగం తగ్గే ప్రమాదముందని అంచనా వేస్తున్నారు.

**వ్యాపారులపై అదనపు భారం పడితే..**

యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు విధిస్తే వ్యాపార కార్యకలాపాల నిర్వహణకు వ్యాపారులు అదనపు భారం మోయాల్సి వస్తుందని నిపుణులు అంటున్నారు. దీంతో వారి లాభాలు దెబ్బతిని పెట్టుబడులు తగ్గుతాయన్నారు. ఆ ప్రభావంతో వినియోగదారులకు అందే ఆఫర్లు తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండీఆర్ ఛార్జీల కారణంగా ప్రమోషన్ ఆఫర్లు తగ్గుతాయని, ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు.

ఈ ప్రభావం చిన్న వ్యాపారులపై కూడా పడుతుందన్నారు. ప్రస్తుతం టీ కొట్టు నుంచి కిరణా దుకాణం వరకు ఇప్పుడిప్పుడే డిజిటల్ లావాదేవీల వైపు మళ్లుతున్నారు. ఎండీఆర్ ఛార్జీల ప్రభావం చిన్న మొత్తంలో జరిపే లావాదేవీలపై కూడా పడుతుందన్నారు. దీంతో డిజిటల్ ట్రాన్సాక్షన్స్ తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

ఎక్కువగా డిజిటల్ లావాదేవీలే.. పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిపే కంపెనీలు అందించే బీమా, ఆరోగ్యం, ఇతర ఆర్థిక సేవలు యూపీఐపైనే ఎక్కువగా ఆధారపడ్డాయని గుర్తుచేశారు. వ్యాపార నిర్వహణ వ్యయాన్ని పెంచకుండా, కస్టమర్ల డిమాండ్‌ను బలహీనపరచకుండా, డిజిటల్ లావాదేవీలు దెబ్బతినకుండా, పేమెంట్ ఎకోసిస్టమ్‌లో పెట్టుబడులు కొనసాగించేలా ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచించారు.




## చరిత్ర సృష్టించిన పీవీ సింధు..

### జపాన్ ఓపెన్ ఫైనల్‌కు చేరిన తెలుగుతేజం

తెలుగు తేజం పీవీ సింధు చరిత్ర సృష్టించింది. తొలిసారి జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో ఫైనల్‌కు చేరిన భారత మహిళా షట్లర్‌గా రికార్డు నమోదు చేసింది. సెమీస్‌లో సింధు 21-19, 15-10 తేడాతో చైనాకు చెందిన చెన్ యుఫీయ్‌పై విజయం సాధించింది. రెండో సెట్‌లో సింధు ఆధిక్యంలో ఉండగానే.. యుఫీయ్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. దీంతో సింధు ఫైనల్‌లో అడుగు పెట్టింది. రెండేళ్ల తర్వాత ఓ ఫైనల్‌కు చేరడం సింధుకు ఇదే తొలిసారి. చివరిసారి 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీ విజేతగా సింధు నిలిచింది. జపాన్ ఓపెన్ ఫైనల్‌లో అకనె యమగుచితో పీవీ సింధు తలపడనుంది. సెమీస్‌లో 9-21, 21-16, 21-14 తేడాతో పుత్రి కుసుమ వర్దానిపై జపాన్‌కు చెందిన యమగుచి విజయం సాధించి ఫైనల్‌కు వచ్చింది. ఆదివారం టైటిల్ పోరు జరగనుంది. ఇందులోనూ గెలిస్తే జపాన్ ఓపెన్‌ను సొంతం చేసుకున్న తొలి భారత మహిళా షట్లర్‌గా సింధు అవతరించనుంది.

## దిగ్గజ ఆల్‌రౌండర్ సోబర్స్ కన్నుమూత

బ్రిడ్జ్‌టౌన్: టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకడిగా పేరొందిన వెస్టిండీస్ దిగ్గజం సర్ గ్యారీ సోబర్స్ కన్నుమూశారు. ఆయన వయసు 89 ఏళ్లు. ఇంకో 11 రోజుల్లో 90వ పుట్టిన రోజు జరుపుకోవాల్సిన సోబర్స్ అనారోగ్యంతో మృతి చెందినట్లు ఆయన తనయుడు డేనియల్ తెలిపారు. వెస్టిండీస్ టెస్టుల్లో మేటి జట్టుగా ఎదగడంలో సోబర్స్ పాత్ర ఎంతో కీలకం. 1954-74 మధ్య సుదీర్ఘ కెరీర్లో 93 టెస్టులాడిన ఈ ఎడమచేతి బ్యాటర్.. 57.78 సగటుతో 8,032 పరుగులు సాధించారు. అందులో 26 శతకాలు, 30 అర్ధశతకాలు ఉన్నాయి. పాకిస్థాన్‌పై 1958లో జరిగిన టెస్టు మ్యాచ్‌లో 365 పరుగులతో అజేయంగా నిలిచిన సోబర్స్.. ఆ కాలానికి టెస్టుల్లో అత్యధిక స్కోరు నమోదు చేశారు. అప్పటికి ఆయన వయసు 23 ఏళ్లే. 1994లో బ్రయాన్ లారా 375 పరుగులు చేసే వరకు, 36 ఏళ్ల పాటు ఆ రికార్డు నిలిచి ఉంది. క్రికెట్ చరిత్రలో ఒకే ఓవర్లో ఆరు సిక్సర్ల ఘనత సాధించిన తొలి బ్యాటర్ గ్యారీనే. ఇంగ్లిష్ కౌంటీ క్లబ్ నాటింగ్‌హామ్‌షైర్ తరఫున ఆయనీ రికార్డునెలకొల్పారు. సోబర్స్ తన స్పిన్ బౌలింగ్‌తోనూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన 235 వికెట్లు పడగొట్టారు. సోబర్స్ ఎడమ చేతి వాటంతో పేస్ బౌలింగే కాక ఆఫ్ స్పిన్, లెగ్ స్పిన్ కూడా వేశారు. సోబర్స్ కెరీర్ చివరి దశలో వన్డేలు మొదలవగా.. ఈ ఫార్మాట్లో ఆయన ఒకే ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ ఆడారు. దేశవాళీల్లో బార్బడోస్, నాటింగ్‌హామ్‌షైర్, సౌత్ ఆస్ట్రేలియా జట్లకు ప్రాతినిధ్యం వహించిన సోబర్స్..



ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో ఏకంగా 28,314 పరుగులు సాధించి, 1043 వికెట్లు తీయడం విశేషం. బ్యాటర్‌గా, బౌలర్‌గానే కాదు.. ఫీల్డర్‌గానూ సోబర్స్‌కు తిరుగులేదు. 1965-72 మధ్య 39 టెస్టుల్లో వెస్టిండీస్‌కు నాయకత్వం వహించిన సోబర్స్.. 9 విజయాలందించారు. ఆయన సారథ్యంలో 10 మ్యాచ్‌లు ఓడిన విండీస్.. 20 టెస్టులను డ్రా చేసుకుంది.



# రామ్‌చరణ్-సుకుమార్ కాంబో

## ఆర్17 పట్టాలకెక్కనుందని ప్రచారం


ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్–రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

# ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ

## ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్




రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్ ÷ట్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో ఇప్పటికే 'ఫౌజీ' సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, ఈ సినిమా కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో స్పష్టంగా తెలుస్తోంది.



# ప్రియాంక చోప్రా బర్త్‌డే

## వారణాసి లుక్ విడుదల

మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'లో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు. ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రియాంక చోప్రా ఫొటోస్ రిలీజ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో మరోసారి ఆసక్తికర ప్రచారం మొదలైంది. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న వారణాసి తొలి గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు అభిమానులు, ఫ్యాన్ పేజీలు పెద్ద ఎత్తున పోస్టులు చేస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. 'బాబు బర్త్‌డేకు భారీ సర్‌ప్రైజ్', 'బాబు బర్త్‌డేకు గ్లింప్స్ లోడింగ్'. 'ఆగస్టు 9న ఇంతకుముందెన్నడూ చూడని హైప్ చూడబోతున్నారు' అంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు షేర్ చేస్తున్నారు. దీంతో హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్‌లో ఉన్నాయి.



# టాలీవుడ్ పద్ధతులు చాలా బాగుంటాయి

## రకుల్ ప్రీత్ సింగ్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమై తన నటనతో చెరగని ముద్ర వేసుకుంది. టాలీవుడ్ స్టార్ హీరోలందరి సరసన నటించి టాప్ హీరోయిన్‌గా నిలిచిన ఈ భామ, కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే బాలీవుడ్‌కు చెక్కేసింది. ప్రస్తుతం హిందీలో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రకుల్, ఇటీవల వచ్చిన 'పతి పత్నీ ఔర్ వో దో' చిత్రంతో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం ఆమె 'రామాయణ పార్ట్-2', 'నాగిల్లా' వంటి భారీ సినిమాల షూటింగ్స్‌తో ఫుల్ బిజీగా గడుపుతోందిఅయితే, తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన రకుల్.. తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమల మధ్య ఉన్న తేడాల గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. టాలీవుడ్ పద్ధతులు చాలా బాగుంటాయని చెప్తూ మన తెలుగు ఇండస్ట్రీపై ప్రశంసలు కురిపించింది. బాలీవుడ్ పరిశ్రమతో పోలిస్తే తెలుగు సినీ పరిశ్రమ ఎంతో సహాయకారిగా, ఐక్యంగా ఉంటుందని రకుల్ చెప్పింది. బాలీవుడ్‌లో నటీనటుల మధ్య అభద్రతాభావం , అసూయ ఎక్కువగా ఉంటాయని.. అందుకే అక్కడ ఒకరి సినిమాలకు మరొకరు మద్దతు ఇవ్వరని ఆమె అభిప్రాయపడింది. అంతేకాకుండా, ఒకరి సినిమాలపై మరొకరు నెగిటివ్ ప్రచారం కూడా చేసుకుంటారని ఒకరినొకరు తొక్కేయడమే అక్కడివాళ్లకి తెలుసని రకుల్ సంచలన వ్యాఖ్యలు చేసింది. కానీ, మన తెలుగు ఇండస్ట్రీలో మాత్రం వాతావరణం చాలా భిన్నంగా ఉంటుందని చెప్పిందిటాలీవుడ్‌లో ప్రతి ఒక్కరూ వేరే హీరోల ట్రైలర్లను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రమోట్ చేస్తారని, ఒకరి విజయాలను మరొకరు మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేస్తారని రకుల్ గుర్తుచేసింది. ఇక్కడ అందరూ కలిసికట్టుగా ఉంటారని ప్రశంసించింది. ఒకవేళ బాలీవుడ్ కూడా తెలుగు ఇండస్ట్రీ లాంటి ఐక్యతను, మంచి గుణాన్ని అలవర్చుకుంటే.. మన దేశంలోనే మన సినిమా పరిశ్రమ అత్యంత బలమైనదిగా మారుతుందని రకుల్ ప్రీత్ సింగ్ చెప్పుకొచ్చింది.




# శృతి హాసన్ ట్రెడిషనల్ గ్లామర్ లుక్

మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ నటి శృతి హాసన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్నో విజయవంతమైన సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ అందాల భామ, కోలీవుడ్‌లోనూ తనదైన ముద్ర వేసుకుంది. ఇటీవల విడుదలైన పెద్ది సినిమాలో ఐటెం సాంగ్‌లో మెరిసిన శృతి, తన స్టైలిష్ డ్యాన్స్‌తో పాటు గ్లామర్‌తో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ శృతి హాసన్ ఎంతో యాక్టివ్‌గా ఉంటూ తరచూ తన లేటెస్ట్ ఫోటోలను అభిమానులతో పంచుకుంటుంది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. పర్పుల్--మెరూన్ కలర్ కాంబినేషన్‌లో ఉన్న చీరను ధరించిన శృతి, దానికి సరిపోయే బ్లౌజ్‌తో స్టైలిష్‌గా కనిపించింది. సైడ్ యాంగిల్‌లో నడుమందాలు హైలెట్ అయ్యేలా ఇచ్చిన పోజుల్లో ఆమె లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నుదిటిపై చిన్న బొట్టు, పెద్ద ఇయర్‌రింగ్స్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేశాయి. మె-ుత్తంగా శృతి హాసన్ లేటెస్ట్ ట్రెడిషనల్ గ్లామర్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

# మరోమారు వార్తల్లో నటి నమిత

## స్లిమ్‌గా మారిన ఫోటోలతో నెటిజన్ల ఆసక్తి





ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన నమిత ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ కుటుంబ జీవితంలో బిజీగా గడుపుతున్న ఆమె.. తాజాగా తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు.ఒకప్పుడు బొద్దుగా కనిపించిన నమిత.. ఇప్పుడు పూర్తిగా స్లిమ్‌గా మారి అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. జిమ్‌లో కఠినంగా వర్కౌట్స్ చేస్తున్న వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. మీ మనసు ఏదైతే నమ్ముతుందో.. మీ శరీరం దానినే అనుసరిస్తుంది అనే సందేశాన్ని కూడా ఆ వీడియోకు జత చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వరుసగా కామెంట్లు చేస్తున్నారు. ఇంత స్లిమ్‌గా మారారు ఏంటి?, నిజంగా ఇది నమితేనా?, స్టైలిష్ లుక్ అదిరిపోయింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆమె కొత్త లుక్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నమిత సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. కన్నడ, తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com